క్లుప్తంగా

టీడీపీ దాడి బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో ఇటీవల నిర్వహించిన అమ్మవారి పండగలో ముగింపురోజు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రజకులపై టీడీపీ వర్గీయులు జరిపినదాడిలో గాయపడిన బాధితులను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం పరామర్శించారు. పినపెంకి గ్రామంలో బాధితుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు.దాడి సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, స్థానిక నాయకులు కుప్ప సింహాచలం, సీహెచ్.నాగభూషణరావు, శర్మ ఉన్నారు.

ఏజీపీగా సత్యనారాయణ



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సత్యనారాయణ

బొబ్బిలి: స్థానిక సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్‌న్యాయవాది చెల్లారపు సత్యనారాయణ నియమితు లయ్యారు. ఈమేరకు శని వారం ఆయన అమరావతిలో న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి జి.ప్రతిమాదేవి చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఆయనకు స్థానిక న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ



ఎంటయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామానికి చెందిన ముద్ద పెంటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను మృతుడు సోదరుడు తౌడును అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, ఎంపీటీసీ పిల్ల గౌరునాయుడు, సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, నాయకులు పొట్నూరు శ్రీనివాసరావు, పల్లి గౌరునా యుడు, ముంజేటి కిశోర్‌కుమార్, తదితరులున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల సందర్శన



అంతకాపల్లి ఎస్‌డబ్ల్యూపీసీలో చెత్తకుండీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి, అంతకాపల్లి గ్రామాల ఎస్‌డబ్ల్యూపీసీలను (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు) ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోజూ గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు. కేంద్రాల్లో సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయిండం వల్ల పంచాయతీలకు సంపద సృష్టి జరుగుతుందని అన్నారు. అనంతరం ఆయా గ్రామాల సచివాలయాల్లో తనిఖీలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలపై సిబ్బందిని ఆరా తీశారు. అలాగే యోగా మాసోత్సవంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

విచారణకు రైతులు హాజరు కావాలి

బాడంగి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో నిధుల దుర్వినియోగం, అవకతవకలపై నోటీసులందుకున్న రైతులు విచారణకు విధిగా హాజరు కావాలని విచారణ అధికారి,సహాయ రిజిస్ట్రార్ రిజ్వాన్ షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు పీఏసీఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి అందు బాటులో ఉంటానని నోటీసులు అందుకున్న రుణగ్రహీతలు తమ అప్పులు, చెల్లింపులు, జమల వివరాల రశీదులతో హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.హాజరు కాకుంటే తమ వద్ద చెప్పుకునేందుకు ఎలాంటి సమాధానంలేదని భావించి, పీఏసీఎస్ రికార్డుల్లో ఉన్న వివరాల మేరకు చట్టపరమైన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.



బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పరిస్థితి

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి



గొల్లపల్లి- బొబ్బిలి బైపాస్‌లో బొబ్బిలి కాలేజ్ వద్ద రోడ్డు దుస్థితి

- బొబ్బిలి నియోజకవర్గంలో అధ్వానంగా రహదారులు
- తాము అధికారంలోకి వస్తే వెంటనే రోడ్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన బేబి నాయన
- ఎన్నికల ముందు గొల్లపల్లి- బొబ్బిలి బైపాస్ రోడ్డులో పాదయాత్ర, సెల్ఫీలతో హడావిడి
- ఏడాది దాటిపోతున్నా అమలు కానీ ఎమ్మెల్యే బేబి నాయన హామీలు

బొబ్బిలి: ఈ నీటి గుంత చూశారా..?ఇది ఎక్కడో గ్రామీణ ప్రాంతంలోని రహదారి కాదు.రెవెన్యూ డివిజన్ కేంద్రం బొబ్బిలి పట్టణంలోని ప్రధానమైన కాలేజ్ రోడ్డు. దీనినే గొల్లపల్లి వెళ్లే బొబ్బిలి బైపాస్ రోడ్డు అంటారు. గడిచిన సార్వత్రిక ఎన్నికలకు ముందు బేబీ నాయన ఈ రహదారి మీదుగానే పాదయాత్ర చేసి ఎన్నికల్లో తమను గెలిపిస్తే వెంటనే ఈ రహదారి మరమ్మతులు, ఆ తర్వాత కొత్త రహదారి నిర్మాణం చేపడతానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఆయనే గెలిచారు. అసెంబ్లీకి వెళ్తున్నారు, వస్తున్నారు. కానీ ఈ రహదారిని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మాత్రం నెరవేరడం లేదు. ఎమ్మెల్యేగా గెలిచాక ఈ రోడ్డు వైపు రావడం మానేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ ఒక్క రోడ్డే కాదు. నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్లది ఇదే పరిస్థితి. రోడ్లను బాగు చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే బేబి నాయన వాటి కోసం పట్టించుకోవడం మానేశారు. నియోజకవర్గంలోని కూనాయవలస నుంచి రామభద్రపురం వరకు, అక్కడి నుంచి పాత బొబ్బిలి వరకు ఉన్న రోడ్లు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. అలాగే బొబ్బిలి



పాత బొబ్బిలి వద్ద గుంతలు



గొర్లె సీతారాంపురం వద్ద బేబీ నాయన సెల్ఫీ తీసుకున్న రోడ్డులో ఆటోలు పాడై ప్రయాణికుల అవస్థలు

పట్టణం లోని గొల్లపల్లి నుంచి తెర్లాం రహదారి వరకూ అయితే అవస్థలు పడుతున్నారు ప్రయాణికులు. ఇదిగో అదిగో అంటూ ప్రకటనలే తప్ప కొత్త రహదారులు నిర్మించిన పాపాన పోలేదు. అలాగే నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతుల కోసం దాదాపు రూ.11 కోట్లు మంజూరైనప్పటికీ ఆ పనులన్నీ తూతూ మంత్రంగా సాగిపోయాయి.ఆ రోడ్లన్నీ మళ్లీ గుంతల తో దర్శనమిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులకు రెండో విడత నిధులు మంజూరు చేస్తామని చెప్పి నేటికి మూడు నెలలు అవుతున్నా వాటి ఊసే లేదు.

వర్షాలు జోరందుకుంటే ఇక అంతే...

పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వీటిని వెంటనే బాగు చేస్తేనే బాగుపడ తాయి. లేకుంటే ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రస్తుతం కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు తొలకరి సీజన్లో వర్షాలు జోరందుకుంటే పరిస్థితి నరక ప్రాయంగా మారుతుందనడంలో సందేహం లేదు.

సెల్ఫీలు తీసుకున్న రోడ్డైనా బాగు చేస్తే మంచిది

రహదారి నిర్మాణాలు చేసిన తర్వాత కనీసం పదేళ్లయినా వాటి నాణ్యత చెక్కు చెదరకూడదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం ఉన్న ఐదేళ్ల పాటు రహదారులు పాడయ్యాయని ప్రచారం చేశారు. కానీ అంతకు ముందున్న టీడీపీ ప్రభుత్వం వాటిని ఎంత నాణ్యతతో నిర్మించిందో అన్న సంగతి కూడా పట్టించుకోకుండా 2024 ఎన్నికలకు ముందు బేబీ నాయన కొన్ని రోడ్ల వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకుని వెంటనే మరమ్మతులు చేయాలని సోషల్ మీడియాలో వాటిని పోస్ట్ చేసి ప్రాచుర్యం పొందారు. ప్రతిపక్షంలో ఉన్న ఆయన మాటకు గౌరవం ఇచ్చి అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొన్ని రోడ్లకు మరమ్మతులు చేయించింది. తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నింటినీ బాగు చేయించేస్తానని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే బేబి నాయన విస్మరించారని, కనీసం ప్రధాన రహదారులకైనా మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి హామీలను నమ్మి మోసపోయారు..



మువ్వల శ్రీనివాసరావు

బొబ్బిలి: కూటమి బూటకపు హామీలను నమ్మిన యువత వారికి ఓట్లేసి మోసపోయారని కాంగ్రెస్ పార్టీ, జిల్లా అధికార ప్రతినిధి, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నియమించిన వలంటీర్ వ్యవస్థతో పాటు ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని రద్దు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వం మారితే ఉద్యోగులు ఎందుకు బలికావాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలేమీ ఇవ్వక పోగా తిరిగి ఉపాధి పొందుతున్న వారి ఉసురు తీస్తోందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఏ ఒక్క ఉద్యోగాన్ని తొలగించబోమని, సూపర్ సిక్స్ కూడా అమలు పరుస్తామని కూటమి పెద్దలు వాగ్దానాలు చేశారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇలా ఉద్యోగాలను తొలగించి నిరుద్యోగాన్ని పెంచి పోషించడం దారుణమన్నారు. వలంటీర్, ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ఆ వ్యవస్థల్లో పనిచేస్తున్న వారి ఉద్యోగాలు తొలగించి వారిని రోడ్డున పడేయడం నీతిమాలిన చర్యలన్నారు. వెంటనే కూటమి హామీస్తామన్న 20లక్షల ఉద్యోగాలను ఇవ్వాలని, సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా డాక్టర్ రాజేష్ పుట్టినరోజు వేడుకలు



డాక్టర్ రాజేష్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ రాజేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేష్ కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇంత పెద్ద కుటుంబాన్ని అందించిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని, నియోజకవర్గ ప్రజలకు సేవచేసే భాగ్యం పార్టీ కల్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పట్టణంతో పాటు నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు

రామభద్రపురం: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియగా పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓ తిరుమలప్రసాద్ తెలిపారు.స్థానిక ఎమ్మార్సీలో శనివారం ఆయన బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీంచారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్‌జీటీలకు మాత్రమే మాన్యువల్ పద్ధతి, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ ద్వారా బదిలీలు జరుగుతాయన్నారు.స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ ప్రక్రియకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసిందన్నారు. ఎస్‌జీటీలకు గడువుందన్నారు.మండలంలో బదిలీల కోసం 51 మంది స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాసులు రాగా అందులో 40 మందికి కన్‌ఫర్మ్ చేశామన్నారు. మిగిలిన 11 మందివి సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని ఆదివారం పరిశీలిస్తామని చెప్పారు. ఎస్జీటీల నుంచి 23 దరఖాస్తులు వచ్చాయన్నారు, పాయింట్ల ఆధారంగా ఎక్కడా తప్పులు జరగకుండా పకడ్బందీగా బదిలీల ప్రక్రియ జరుగుతుందన్నారు.

ఏం ప్రయోజనం...?



రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసే హెచ్చరిక, సూచికల బోర్డుల విషయంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో, మలుపుల వద్ద వీటిని ఏర్పాటు చేస్తుంటారు. వంగర మండలంలో ఆర్ అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న కె.కొత్తవలస జంక్షన్ – కొప్పర గ్రామం రోడ్డులో మలుపులకు ముందు ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు విరుద్ధం గా ఉన్నాయి. మలుపులు ఓ వైపు ఉంటే సూచికల బోర్డులు మరోవైపు ఉన్నాయి. వీటితో వాహనచోదకులు అయోమయానికి గురవుతున్నారు.

– వంగర

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా..!

బాడంగి మండలంలో కలప అక్రమరవాణాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. పచ్చని చెట్లను నరికేసి ఇష్టారీతిగా తరలించేస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కలప వ్యాపారుల అడ్డగోలు చర్యలకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. ఫారెస్టు, రెవెన్యూ అధికారుల అనుమతులులేకుండా టేకు, ఇతర విలువైన చెట్లను నరికేస్తూ మండలంలోని పాల్తేరు మీదుగా కోటిపల్లి రోడ్డులో ట్రాక్టర్ల తో రాజాం వైపు తరలించేస్తున్నారు. అధికారులు స్పందించి కలప అక్రమరవాణాను అడ్డుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులుపెట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

– బాడంగి



శిథిలావస్థలో పశువైద్య కేంద్ర భవనం



నెమలాం గ్రామంలోని పశు వైద్య కేంద్ర భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. ఈ పశువైద్య కేంద్రానికి నెమలాంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి రైతులు పశువులను వైద్యం కోసం తీసుకువస్తుంటారు. భవనం శిథిలావస్థలో ఉండడంతో వర్షాలు కురిసే సమయంలో నీరు కారుతోంది. దీంతో మందులు తడిసి పోతున్నాయి. శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని, లేదంటే భవనానికి మరమ్మతులైనా చేయించాలని పాడి రైతులు కోరుతున్నారు.

– తెర్లాం

ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

బొబ్బిలి: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పేదలకు ఇంకా ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాలు ఇవ్వలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న అన్నారు. స్థానిక జెండా మహల్ వద్ద శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి నాయకుల తీరు చూస్తుంటే కేవలం హామీలకే పరిమితమవుతున్నట్టుందని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం తక్షణమే పట్టణ ప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు ఇవ్వాలన్న డిమాండ్‌తో జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.పేద ప్రజలంతా ఈ ధర్నాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు గొల్లపల్లి తౌడు, పి.వి.ఎస్.నారాయణ, మూర్తి, హరి, ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.



ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సారా రహిత మండలంగా తీర్చిదిద్దుదాం



అధికారులతో సమావేశమైన ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: సారా రహిత మండలంగా వంగరను తీర్చిదిద్దుదామని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధి కారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ సారా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేద్దామన్నారు. అనంతరం సారా నిర్మూలనకు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ సురేష్ ముఖర్జీ, సభ్యులుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జైభీమ్, తహసీల్దార్ దిరిశాల ధర్మరా జు, ఎంపీడీఓ ఎస్.రఘునాథీచారి, ఎస్ఐ షేక్ శంకర్ ఉంటారని ఎంపీపీ తెలిపారు. గతంలో సంగాం, వి.వి.ఆర్.పేట గ్రామాల్లో సారా కేసులు నమోదయ్యాయని, ఆయా గ్రామాల్లో సారా నిర్మూలనకు కృషి చేయాలని కమిటీ నిర్ణయించింది.

నవధాన్యాలతో భూమి సారవంతం

రేగిడి/బాడంగి: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ డీపీఐ మహేష్, ఎల్-2 సురేష్, వ్యవసాయ శాఖ ఏఈఓ సాయికుమార్ తెలిపారు.నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల సాగుతో కలిగే ప్రయోజనాలపై రేగిడి మండలం ఉంగరాడ, బాడంగి మండలంలోని రేజేరు రైతుసేవా కేంద్రాల్లో రైతులకు శనివారం అవగాహన కల్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాలను సాగు చేయడం వల్ల నేలలో స్థూల,సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయని, భూమి గుల్లబారి మొక్కకు కావాల్సిన పోషకాలు అందు తాయని, ఫలితంగా మంచి దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తన కిట్లను పంపిణీ చేశారు. రేజేరు వీఏఏ సాయి తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: ఉంగరాడలో రైతులకు నవధాన్యాల విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వంగర: రోజూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజినీదుర్గ అన్నారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా మగ్గూరు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్యం, బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కౌమార బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. బాలికలు చదువుకోవాలని, బడి మధ్యలో మానేసిన వారిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వేరికోస్ వెయిన్స్‌కు పరిష్కారం

బొబ్బిలి: వైద్యులు సూచించిన పరీక్షలు,కొద్దిపాటి జాగ్రత్తలతో వేరికోస్ వెయిన్స్(ఉబ్బిన సిరల)సమస్య పరిష్కారమవుతుందని రక్తనాళాల వ్యాధి నిపుణులు డాక్టర్ గణేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్త నాళాల వ్యాధులకు సంబంధించిన వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైద్య నిపుణులు మిథేలి ప్రారంభించారు. సుమారు 94 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు, స్థానిక అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాసన్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, శ్రీహరి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు థైరాయిడ్ వైద్య శిబిరం

పట్టణంలోని 5,6 వార్డుల పరిధిలో ఈనెల 25న ఉచిత థైరాయిడ్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు శనివారం తెలిపారు. చాలా మంది మహిళలు థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నారని, అటువంటి వారంతా ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రోటరీక్లబ్ కార్యవర్గం, వైద్య నిపుణులు

సంక్షిప్తంగా...

పేదలకు అన్నదానం

రాజాం: కంచరాం సమీపంలోని జేఎల్‌కే టైల్స్ ఎండీ కృష్ణార్జునతో పాటు శ్రీకాకుళంకు చెందిన డాక్టర్ అవినాష్, డాక్టర్ స్వాతి వాసంతిలు శనివారం పేదలకు అన్నదానం చేశారు. కంచరాంతో పా టు రాజాం పరిసర గ్రామాల్లోని పేదలకు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఏ.వి.జగన్నాథ రావు పట్నాయక్ పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించా మని వారు తెలిపారు.

నిరసన

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు.ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్. రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభు త్వానికి పట్టకపోవడం దారుణమని అన్నారు. తక్షణమే ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, నరసింగరావు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో శనివారం సాయంత్రం తృటిలో ప్రమాదం తప్పింది. చీపురుపల్లి వైపు నుంచి రాజాం వస్తున్న ఓకారు అదుపు తప్పి ఇటీవల నూతనంగా నిర్మించి, సగంలో వదిలేసిన డివైడర్‌పైకి దూసుకెళ్లి మధ్యలో నిలిచిపోయింది. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సహాయంతో కారును బయటకు తీశారు.

యోగా శిక్షణ తరగతులు, ర్యాలీ రేపు

బొబ్బిలిరూరల్: 'యోగాంధ్ర'లో భాగంగా ఈనెల 26న మండలకేంద్రంలో తలపెట్టిన ర్యాలీ,అవగాహన సదస్సులు, యోగా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్ని శాఖల అధికారులను కోరారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు,వైద్యులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మండల పరి షత్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అనంతరం ఇతర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు చేయించాలి

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా ఉపాధిహామీ పనులు చేయించాలని డ్వామా కోర్సు డైరెక్టర్ కె.చిన్నంనాయుడు ఉపాధి సిబ్బందికి సూచిం చారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతుల మెట్ట పొలాల్లో ఫారం పాండ్ల పనులు చేపట్టాలని చెప్పారు. ఉద్యానవన పంటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఓ శంఖాబత్తుల హరనాథ్, ఏపీఓ-2 ఎం.శ్రీనివాసరావు, జేఈ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి

బొబ్బిలిరూరల్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను రెవెన్యూ సిబ్బంది చేరుకోవాలని తహసీల్దార్ మల్లెపురెడ్డి శ్రీను అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ మందగొడిగా ఉందని, రీసర్వేలు, నీటి తీరువా వసూళ్లపై దృష్టిసారించాలని ఆదేశించారు. రీసర్వే వినతులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. కొత్తగా ఇళ్ల స్థలాలకోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి అర్హతలను పరిశీలించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వెళితే సంబంధిత వీఆర్‌ఓదే బాధ్యతని, ఎప్పటికప్పుడు రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యం

రేగిడి: రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఖండాం, సంకిలి ఆయుష్ వైద్యాధికారులు ఎం.సునీల్‌కుమార్, డి.మోహనరావు అన్నారు.యోగా మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం వారు ఆవిష్కరించారు. యోగా మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు, ఏఎస్‌ఓ యేసుబాబు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బం ది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.